'పది'పై ప్రత్యేక ప్రణాళిక

- పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు
- వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయుల ప్రత్యేక శ్రద్ధ
- ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు

ప్రతి విద్యార్థి దశలో కీలకమైన మలుపు పదో తరగతి. అలాంటి పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలనే దృక్పథంతో మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. గతంలో సాధించిన ఫలితాల కన్నా ఈసారి మరింత మెరుగైన ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో తీవ్రంగా కసరత్తు చేస్తున్నారు. తరగతి గదుల్లో పాఠాలు బోధిస్తూనే వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. అంతేకాకుండా ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ మార్చిలో జరిగే వార్షిక పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు.
– కోనరావుపేట, జనవరి 29

కోనరావుపేట మండలంలోని 12ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, ఆదర్శ పాఠశాల, ఏకలవ్య రెసిడెన్షియల్‌తోపాటు కొలనూర్‌లో మార్గదర్శి పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో మొత్తం 424మంది పదో తరగతి చదువుతుండగా 249మంది బాలురు, 175 మంది బాలికలు పరీక్షకు హాజరుకానున్నారు.

ప్రత్యేక తరగతులు, పరీక్షలు..

డిసెంబర్ నుంచే ప్రభుత్వం పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులను కొనసాగిస్తున్నది. ఉదయం 8.30నుంచి 9.30గంటల వరకు, సాయంత్రం 4.45 నుంచి 5.45గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు ప్రభుత్వం ఇచ్చిన షెడ్యూల్‌కు అనుగుణంగా ఉదయం, సాయంత్రం వేళల్లో సబ్జెక్టుల వారీగా ప్రత్యేక తరగతులను తీసుకుంటున్నారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా కృషి చేస్తూ, వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ముఖ్యంగా విద్యార్థులకు ప్రాజెక్ట్ వర్క్, రోజు వారి టెస్టులు నిర్వహిస్తూ మెరుగైన స్థాయికి చేరేలా కృషి చేస్తున్నారు. జనవరిలో సబ్జెక్టుల వారీగా గ్రాండ్ టెస్టులు, స్లిప్ టెస్టులు, ఫిబ్రవరి ప్రిఫైనల్ పరీక్షలను నిర్వహించనున్నారు. అనంతరం వార్షిక పరీక్షలకు విద్యార్థులు హాజరుకానున్నారు.

ఆరు సబ్జెక్టులు.. ఏడు పేపర్లు

పదో తరగతి విద్యార్థుల వార్షిక పరీక్షలు మార్చి 18న ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులకు ఆరు సబ్జెక్టులు ఉండగా ఏడు పేపర్లుగా పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందులో సైన్స్ సబ్జెక్టును ఇంతకుముందు ఒక్క రోజే నిర్వహించే వారు. ప్రస్తుతం ఫిజికల్, బయోలాజికల్ సైన్స్ పేపర్లు విభజించి రెండు పేపర్లు నిర్వహించనున్నారు. ప్రతి పేపర్‌కు 50మార్కుల చొప్పున రెండు పేపర్లకు 100 మార్కులు ఉండనున్నాయి.

మరిమడ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతిలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు

సందేహాలను నివృత్తి చేస్తున్నరు

పాఠశాలకు ఉదయాన్నే రావడంతో ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు చక్కగా గుర్తుంటున్నాయి. ప్రశాంత వాతావరణంలో చదివిస్తున్నారు. రోజు వారీగా ఉదయం, సాయంత్రం వేళలో సబ్జెక్టుల వారీగా చదివిస్తున్నారు. దీంతో తరగతి గదిలో నేర్చుకున్న పాఠాలలో ఏమైనా సందేహాలుంటే ప్రత్యేక తరగతుల్లోని వృత్తి చేసుకుంటున్నాం. ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపుతుండడంతో మంచి ఫలితాలు సాధిస్తాం.
– సింగిరెడ్డి జశ్వంత్‌రెడ్డి, పదో తరగతి విద్యార్థి, మరిమడ్ల

సబ్జెక్టు వారీగా తరగతులు

ఉపాధ్యాయులు ప్రతి రోజూ సబ్జెక్టు వారీగా ప్రత్యేక తరగతులు చెబుతున్నారు. ఎంత మేర చదివం, ఇంకేమైనా సందేహాలు ఉన్నాయా.. అర్థంకానివి ఏమైనా ఉన్నాయా.. అంటూ టీచర్లు అడుగుతూ సులువుగా అర్థమయ్యే విధంగా వివరిస్తున్నారు. టీచర్లు సూచించిన విధంగా పది వార్షిక పరీక్షలకు సిద్ధం అవుతున్నాం. రోజు వారీగా ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో అన్ని సబ్జెక్టుల్లో పట్టు సాధించడానికి అవకాశం ఉంది. తప్పకుండా 10జీపీఏ సాధిస్తా.
– కీర్తన, పదో తరగతి విద్యార్థిని, కొలనూర్

వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించేలా ప్రత్యేక కృషి చేస్తున్నాం. విద్యాశాఖ అదేశాలనుసారం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నాం. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. ఉదయం, సాయంత్రం వేళలో సబ్జెక్టుల వారీగా తరగతులు నిర్వహిస్తూ, ఉత్తమ ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రధానంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించి విద్యను బోదిస్తున్నాం.
– మంజూలదేవి, ప్రధానోపాధ్యాయురాలు, సుద్దాల

శత శాతం ఫలితాల సాధనకు కృషి

మండలంలో 424మంది పదో తరగతి చదువుతున్నారు. విద్యాశాఖ ఆదేశాల మేరకు డిసెంబర్ నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. పాఠశాలల వారీగా ఇప్పటికే టైం టేబుల్ ఇచ్చాం. అందుకు అనుగుణంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించి వారిని ప్రోత్సహిస్తున్నాం. ఈ విద్యా సంవత్సరం శత శాతం ఫలితాలు రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నాం.
– దూస రఘుపతి, ఎంఈవో, కోనరావుపేట

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ

అసత్య ప్రచారం మానుకోవాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ

సిరిసిల్ల టౌన్, జనవరి 29: కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్ పార్టీపై చేస్తున్న అసత్య ప్రచారం ఇప్పటికైనా మానుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ హితవుపలికారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సోషల్ మీడియా, ప్రచార మాధ్యమాల్లో మున్సిపల్‌లో అవిశ్వాసం అంటూ వస్తున్న వార్తలను ఖండిస్తున్నామన్నారు. పాలక వర్గంలోని తమ పార్టీకి చెందిన నలుగురు కౌన్సిలర్లు వ్యక్తిగత కారణాలతో బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి హాజరు కాలేదన్నారు. ఈ విషయాన్ని కొందరు తమ స్వార్థప్రయోజనాల కోసం అవిశ్వాసం అంటూ బీఆర్ఎస్ పార్టీపై బురదజల్లే క్రమంలో అసత్య ప్రచారానికి తెరలేపారని విమర్శించారు. ఇందులో ఎలాంటి వాస్తవం లేదని కొట్టిపారేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో తామంతా పార్టీలో ఏకతాటిపై ఉన్నామని స్పష్టం చేశారు. పట్టణ ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. మున్సిపల్ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా గత ప్రభుత్వ హయాంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సిరిసిల్ల మున్సిపల్‌కు కేటాయించిన రూ.40కోట్ల నిధులు టెండర్ పూర్తి కాగా, నూతన ప్రభుత్వ ఆదేశాల మేరకు నిలిపివేసినట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి సిరిసిల్ల అభివృద్ధికి సహకరించాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం ఉపసంహరణ

చందుర్తి, జనవరి 29: చందుర్తి సింగిల్‌విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్‌పై అవిశ్వాస తీర్మాన ప్రతిపాదనను డైరెక్టర్లు ఉపసంహరించుకున్నారని సింగిల్‌విండో సీఈవో గంగారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చైర్మన్ తిప్పని శ్రీనివాస్‌పై డైరెక్టర్లు గత నెల 23న అవిశ్వాస తీర్మానం కోరుతూ డీసీవో బుద్ధనాయుడుకు నోటీస్ అందించారు. ఈనెల 17న అవిశ్వాసంపై ఓటింగ్ జరగాల్సి ఉండగా వాయిదా వేశారు. తిరిగి 29న ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయగా మెజార్టీ డైరెక్టర్లు అవిశ్వాసం ఉపసంహరించుకున్నట్లు తెలిపారు.

అభివృద్ధికి సహకరించాలి: ఎమ్మెల్యే కవ్వంపెల్లి

కేశన్నపల్లిలో జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

ఇల్లంతకుంట, జనవరి 29: గ్రామాల అభివృద్ధికి అందరూ సహకరించాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపెల్లి సత్యనారాయణ కోరారు. సోమవారం ఆయన కేశన్నపల్లి, జవారుపేట గ్రామాల్లో నూతన గ్రామ పంచాయతీ కార్యాలయాలను ప్రారంభించారు. నూతన హంగులతో గ్రామ పంచాయతీ కార్యాలయాలను నిర్మించినట్లు తెలిపారు. ఇక్కడ ఎంపీపీ ఊట్కూరి వెంకటరమణారెడ్డి, ఎంపీడీవో మీర్జా, సర్పంచులు పోతరాజు ఎల్లవ్వ, అన్నాడి కరుణ, మాజీ ఎంపీపీ గుడిసె ఐలయ్య, నాయకులు చంటి, మల్లేశం, రవీందర్‌రెడ్డి, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్, తదితరులు ఉన్నారు.

బాలికపై లైంగిక దాడికి యత్నం

కోనరావుపేట, జనవరి 29: బాలికపై ఓ వ్యక్తి లైంగికదాడికి యత్నించగా, పోలీసులు అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన కోనరావుపేట మండలంలో చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వరుసకు మనుమరాలు అయిన బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో సమాచారం అందుకున్న డీఎస్పీ నాగేంద్రాచారి సదరు వ్యక్తిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. ఈ మేరకు సదరు వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

- అదనపు కలెక్టర్ పూజారి గౌతమి

వేములవాడ టౌన్, జనవరి 29: మహా శివరాత్రి, సమ్మక్క–సారలమ్మ జాతరను పురస్కరించుకుని వేములవాడ రాజన్న దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ పూజారి గౌతమి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె ఆలయ పరిసరాల్లో పర్యటించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఇక్కడ ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్ మహేశ్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, ఆలయ ఏఈవో జయకుమారి, ఈఈ రాజేశ్, డీఈ మధు రఘునందన్, ఏఈ రాంకిషన్‌రావు ఉన్నారు.

నేటి నుంచి త్యాగరాజ ఆరాధనోత్సవాలు

వేములవాడ టౌన్, జనవరి 29: నేటి నుంచి త్యాగరాజ ఆరాధనోత్సవాలు ప్రారంభం కానున్నాయి. మంగళవారం ఉదయం 10 గంటలకు పాలెపు చంద్రశేఖరశర్మ శ్రీ త్యాగరాజస్వామివారి జీవిత విశేషాలు, 10:30 గంటలకు వీ జ్యోత్స్నలక్ష్మి, ఎం సువర్ణ, కొరిడె నరహరిశర్మ, సతీశ్, మంజుల, రేవతి, సునీత కళా బృందం పంచరత్నగానం, మధ్యాహ్నం 3 గంటలకు శ్రీమతి స్వర్ణలత భాగవతార్ హరికథ, 4:30 గంటలకు శ్రీమతి పద్మప్రియ బృందం సంగీత కచేరి, 5:30గంటలకు గుమ్మడి జనార్దన్, శ్రీమతి వాణి సితార సోలో కచేరి, 6:30గంటలకు ఉమాదేవి సంగీత కచేరి, రాత్రి 7:30కు మంగళంపల్లి స్వర్ణలత శాస్త్రీయ సంగీత కచేరి, రాత్రి 8.30కి జీ రేఖ నృత్యబృందం నృత్య ప్రదర్శన, 9:30కు భక్తతులసీదాస్ చరిత్ర పౌరాణిక నాటక ప్రదర్శన ఉంటుంది.

ట్రాఫిక్ నిబంధనలతో ప్రమాదాలకు చెక్

తెలంగాణ చౌక్, జనవరి 29: ట్రాఫిక్ నిబంధనలు సక్రమంగా పాటిస్తే రోడ్డు ప్రమాదాలకు చెక్ పెట్టవచ్చని పట్టణ సీఐ రఘుపతి పేర్కొన్నారు. సిగ్నల్స్‌పై అవగాహనలో భాగంగా మహర్షి పాఠశాలలో విద్యార్థులకు సోమవారం ట్రాఫిక్ నియమాల పుస్తకాలను పంపిణీ చేశారు. ఇక్కడ ట్రాఫిక్ ఎస్ఐ రాజు, సేఫర్ ఇండియన్ రోడ్ యూత్ సెక్యూర్ ఆర్గనైజేషన్ ఎన్జీవో సంస్థ ప్రతినిధి ఓఝా ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చందుర్తి, జనవరి 29: రుద్రంగి, మర్రిగడ్డ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపడుతున్నందున మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని సెస్ ఏఈ మహేశ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతపల్లి, మూడపల్లి, నర్సింగాపూర్, తిమ్మాపూర్, అశిరెడ్డిపల్లి, ఎన్గల్, జోగాపూర్, మల్యాల, చెరువు కుంటపల్లి, చందుర్తి, రుద్రంగిలో ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటల దాకా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని చెప్పారు.

విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజ

ముస్తాబాద్, జనవరి 29: గూడెం గ్రామంలోని రాజరాజేశ్వర వడ్డెర కాలనీలో స్వాతంత్ర సమరయోధుడు వడ్డె ఓబన్న విగ్రహ ప్రతిష్ఠకు వడ్డెర సంఘం నాయకులు సోమవారం భూమిపూజ చేశారు. ఇక్కడ జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షుడు సూర దేవరాజు, సర్పంచ్ చిట్నేని సరిత శ్రీనివాసరావు, గ్రామ వడ్డెర సంఘం అధ్యక్షుడు వల్లెపు రాజలింగం, వడ్డెర ఓబన్న జిల్లా అధ్యక్షుడు గోగుల రమేశ్, ఎంపీటీసీ బొప్ప శ్రీధర్, ఉప సర్పంచ్ సడ శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.

చోరీకి యత్నం

ఎల్లారెడ్డిపేట, జనవరి 29: మండల కేంద్రంలోని శివాలయం, వేణుగోపాల స్వామి ఆలయాల్లో ఆదివారం దుండగులు చోరీకి యత్నించారు. సోమవారం వేణుగోపాలస్వామి ఆలయ కమిటీ చైర్మన్ జితేందర్, వైస్ చైర్మన్ గంట వెంకటేశ్ ఆలయ తాళం పగులగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. శివాలయం, వేణుగోపాలస్వామి ఆలయాల మొదటి దర్వాజ తాళాలు పగులగొట్టినప్పటికీ గర్భగుడి గ్రిల్ డోర్స్ తెరిచేందుకు విఫలయత్నం చేసి పారిపోయారు. అందుకు ఉపయోగించిన రాడ్లు, గొడ్డలి అక్కడే పడేసి వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. 9640468899 / 9640258899.
NT-319424-All
NAME OF CHANGE
★Venisetti Ramesh S/o Anjaneyulu H.No. 20-224, Vidyanagar, Huzurabad Town & Mandal, Karimnagar Dist, TS, my surname was Changed as Venishetti Ramesh S/o Anjaneyulu As per Aadhar Card.
NTK-0000
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

'గ్రీవెన్స్‌డే'ను సద్వినియోగం చేసుకోవాలి

- ఎస్పీ అఖిల్ మహజన్
- బాధితుల నుంచి అర్జీల స్వీకరణ

రాజన్న సిరిసిల్ల, జనవరి 29 (నమస్తే తెలంగాణ): జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్ డేను బాధితులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ కోరారు. జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌డే కార్యక్రమంలో పలువురు బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, మాట్లాడారు. బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు గ్రీవెన్స్‌డే ఏర్పాటు చేయగా, 16మంది ఫిర్యాదులు చేశారన్నారు. సమస్యలను పరిష్కరించాలని సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. భూ, ఆస్తి తగాదాల్లో చట్ట ప్రకారం బాధితులకు న్యాయం అందించాలన్నారు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడంతో సాధ్యమైనంత తర్వగా పరిష్కారం అవుతాయని చెప్పారు.

పోలీస్ ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మూడు రోజుల పాటు నిర్వహించే సిరిసిల్ల పోలీస్ ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎస్పీ అఖిల్ మహజన్ సోమవారం ప్రారంభించారు. నిత్యం పని ఒత్తిడితో ఉండే పోలీసులకు ఈ టోర్నమెంట్‌తో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. మూడు రోజుల పాటు ఈ క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు ఉదయ్‌రెడ్డి, నాగేంద్రాచారి, సీఐలు రఘుపతి, అనిల్‌కుమార్, శశిధర్‌రెడ్డి, కరుణాకర్, కృష్ణకుమార్, ఆర్ఐలు రమేశ్, మధూకర్, యాదగిరి ఉన్నారు.

సిరిసిల్ల పోలీస్ ప్రీమియం లీగ్ క్రీడాకారులతో ఎస్పీ అఖిల్ మహాజన్


వేములవాడ రూరల్: మారుపాకలో పల్లె దవాఖానను ప్రారంభిస్తున్న విప్ ఆది శ్రీనివాస్, జడ్పీచైర్‌పర్సన్ అరుణ

దశల వారీగా అభివృద్ధికి కృషి: విప్

వేములవాడ రూరల్, జనవరి 29: దశలవారీగా అభివృద్ధికి కృషి చేస్తానని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం ఆయన వేములవాడ మండలం మారుపాకలో పల్లె దవాఖానను ప్రారంభించి, సీసీ రోడ్ల నిర్మాణానికి జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణతో కలిసి భూమిపూజ చేశారు. పల్లె దవాఖానలతో పేదలకు వైద్యం అందుబాటులో ఉంటుందన్నారు. మహిళాలక్ష్మి పథకంలో భాగంగా తొమ్మిది బస్సులను అదనంగా మంజూరు చేశారన్నారు. ఇక్కడ ఎంపీపీ బూర వజ్రమ్మ, సర్పంచ్ చెన్నమనేని స్వయంప్రభ, నాయకులు ఉన్నారు.

కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలి

వేములవాడ, జనవరి 29: విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సూచించారు. వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటుచేసిన మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. దాతల సహకారంతో మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇక్కడ ప్రిన్సిపాల్ ప్రమోద్ కుమార్, అధ్యాపకులు, నాయకులు ఉన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

వీర్నపల్లి, జనవరి29: మండల కేంద్రంలోని కేజీబీవీలో రూ.లక్షతో హైమాస్ట్ లైట్, బాబాయిచెరువుతండాలో రూ.90వేలతో బోరుమోటర్ ఏర్పాటు చేయగా సెస్ డైరెక్టర్ మాడ్గుల మల్లేశం, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు సాగర్ సోమవారం ప్రారంభించారు. నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే కేటీఆర్, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషాకు కృతతలు తెలిపారు. ఇక్కడ సర్పంచ్ పాటి దినకర్, ఎంపీటీసీ అరుణ్‌కుమార్, ఉప సర్పంచ్ రవి, బంజారా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుగులోత్ సురేశ్‌నాయక్, నాయకులు ఉన్నారు.

బెల్టుషాపు యజమానుల బైండోవర్

బోయినపల్లి, జనవరి 29: నిబంధనలు అతిక్రమించిన ఐదు గురు బెల్టుషాపు యజమానులను సోమవారం తహసీల్దార్ పుష్పలత ఎదుట వారిని బైండోవర్ చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఒక్కొక్కరికి రూ.50వేల చొప్పున జరిమానా విధించినట్లు చెప్పారు.

ఆర్థిక సాయం

వేములవాడ, జనవరి29: మున్సిపల్ పరిధిలోకి నాంపెల్లికి చెందిన నగరపు ప్రశాంత్‌కు ఇటీవల జరిగిన ప్రమాదంలో కాలుకి తీవ్ర గాయమైంది. బాధిత కుటుంబాన్ని మన చారిటబుల్ ట్రస్టు సభ్యులు సోమవారం పరామర్శించి, రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. ఇక్కడ ట్రస్టు అధ్యక్షుడు మోటూరి మధుసూదన్, సభ్యులు ఉన్నారు.

దివ్యాంగుడికి చేయూత

కోనరావుపేట, జనవరి 29: కొలనూర్‌లో దివ్యాంగుడైన మెరుగు ఆంజనేయులు తల్లి ఇటీవల మృతిచెందగా దివ్యాంగ జిల్లా నాయకులు సోమవారం పరామర్శించి 25కిలోల బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేశారు. ఇక్కడ మన్మోహన్, రాజు, బాలచందర్, మాదాస్ రాజేశ్, రాజేందర్, హరిప్రసాద్, తదితరులు ఉన్నారు.

జీపీకి భూమి ఇప్పించాలి

కోనరావుపేట, జనవరి 29: కొలనూర్‌లో ఏర్పాటు చేసిన వెంచర్ల నుంచి గ్రామ పంచాయతీకి రావాల్సిన భూమిని ఇప్పించాలని కలెక్టర్‌కు సోమవారం గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వే నంబర్ 704ఏ,472ఈ, 671డీ, 702సీ, 732లో 12ఎకరాలు వ్యవసాయ భూమిని వెంచర్ వేసి ప్లాట్లుగా విక్రయిస్తున్నారని, ఈ సర్వే నంబర్లలో జీపీకి సంబంధించి 1.08గుంటల భూమి ఉందన్నారు.

రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

కలెక్టరేట్, జనవరి 29: సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలు, కేజీబీవీలు, యూనివర్సిటీలకు గత జూన్ నుంచి డైట్ బిల్లును విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ సోమవారం డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఏవోకు వినతిపత్రం అందజేశారు.

దివ్యాంగుడి వద్దకే వెళ్లి..

- అర్జీని స్వీకరించిన అదనపు కలెక్టర్ పూజారి గౌతమి
- సమస్యను పరిష్కరించాలని అధికారులకు ఆదేశం

కలెక్టరేట్, జనవరి 29: జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ఈ క్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను అదనపు కలెక్టర్లు ఎన్ ఖీమ్యా నాయక్, పూజారిగౌతమి స్వీకరించారు. ఈ క్రమంలో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన దివ్యాంగుడు బీ సంగమేశ్వర్ ప్రజావాణిలో దరఖాస్తు చేసేందుకు రాగానే, అదనపు కలెక్టర్ గౌతమి అతడి వద్దకు వెళ్లి సమస్యను అడిగి తెలుసుకున్నారు. సదరమ్ సర్టిఫికెట్‌లో వైకల్యశాతం సమస్యను పరిష్కరించాలని సంగమేశ్వర్ కోరగా, వెంటనే పరిష్కారం చూపాలని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజంను ఆమె ఆదేశించారు. అలాగే ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణికి మొత్తం 39అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు ఆనంద్‌కుమార్, మధుసూదన్, అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగుడు సంగమేశ్వర్ వద్దకు వెళ్లి సమస్యను అడిగి తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ గౌతమి

సమస్యలుంటే చెప్పండి

ఎల్లారెడ్డిపేట, జనవరి 29: ఎవరైనా వేధింపులకు గురిచేస్తే భయపడకుండా తమకు సమాచారం అందించాలని ఉమెన్ హబ్ కోఆర్డినేటర్ రోజా సూచించారు. సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోషల్ మీడియా ద్వారా ఉపయోగపడే, నిరుపయోగపడే అంశాలపై అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్‌ను జ్ఞానాన్ని పెంచుకోవడానికి మాత్రమే వాడాలని సూచించారు. సోషల్‌మీడియాలో అనవసరంగా వ్యక్తిగత ఫొటోలు, సమాచారం షేర్ చేయవద్దన్నారు. ఇక్కడ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

'పది' విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

రుద్రంగి, జనవరి 29: జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కలెక్టర్ ఆదేశాల మేరకు రుద్రంగిలోని ఎస్సీ సాంఘిక సంక్షేమ వసతి గృహ పరిధిలోని 36మంది విద్యార్థులను సిరిసిల్ల అంబేద్కర్ భవన్‌కు తరలించి, తరగతులు నిర్వహించారు, వసతి గృహ సంక్షేమాధికారి రవీంద్రస్వామి విద్యార్థులకు వాహనాలను సమకూర్చారు.

పూర్వ విద్యార్థుల చేయూత

నిర్మాణమైన అదనపు తరగతి గదులు

- పాఠశాల అభివృద్ధికి సాయం
- నిధుల